మాదకద్రవ్య మహమ్మారిని తరిమికొడదాం



విజయనగరం జిల్లా కేంద్రంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీలో జడ్జి బబిత, న్యాయవాదులు తదితరులు



నెల్లిమర్ల: మిమ్స్ వద్ద మాదకద్రవ్యాల నిషేధంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దారు శ్రీకాంత్, తదితరులు

వాడవాడలా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, విద్యార్థులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, అవగాహన ర్యాలీలు చేపట్టారు. మాదకద్రవ్య మహమ్మారిని తరిమికొడదాం.. డ్రగ్స్ వద్దు..ఆరోగ్యమే ముద్దు..అని నినాదాలు చేశారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, మద్యం, సిగరెట్, ఖైనీ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసలైతే ఉజ్వల భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. యువత వ్యసనాలు వీడి, లక్ష్యం వైపు సాగాలని భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు.

–విజయనగరం, నెల్లిమర్ల


విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తున్న జీఆర్పీ సిబ్బంది


పూసపాటిరేగ: చింతపల్లిలో విద్యార్థుల ర్యాలీ


విజయనగరం టౌన్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారి శ్రీనాథుడు



పూసపాటిరేగ: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగమాధవి, పోలీసులు


డెంకాడ: మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్న జడ్జి కృష్ణప్రసాద్


డెంకాడ: పెదతాడివాడలో ర్యాలీలో సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ సన్యాసినాయుడు తదితరులు


విజయనగరం అర్బన్: మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


భోగాపురంలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు

క్లుప్తంగా

సన్మానం


హెచ్‌ఎం శంకరరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పూసపాటిరేగ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లిన బలివాడ శంకరరావు, ఇతర ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది గురువారం సన్మానించారు. అనంతరం విద్యార్థుల బంగారు భవితకు వారు చేసిన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సౌభాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు శేషసాయి, చినసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

29న సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: నగరంలోని గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో విజయభావన సాహితీ సదస్సు ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎ.గోపాలరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. సాహిత్యం–సమకాలీన సమాజం అనే అంశంపై గజపతినగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు శ్యామల ప్రసంగిస్తారన్నారు.

ప్రతి మహిళ పారిశ్రామికవేత్త కావాలి

నెల్లిమర్ల: ప్రతి మహిళ పారిశ్రామికవేత్త కావాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆకాంక్షించారు. నగరపంచాయతీ పరిధిలోని ఓ కల్యాణ మండపంలో రిసోర్స్‌పర్సన్లకు ట్యాబ్‌లు, డిజిటల్ లక్ష్మిలకు స్కానర్లు గురువారం అందజేశారు. మహిళల ప్రగతి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. రాజారావు మేడ దగ్గరలోని తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందని, ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు. పల్లి, కోలగట్ల, కమ్మ, చిక్కాల, కొణిశి, తెలకల వీధులకు నీటి సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. పైపులైన్ బాగుచేసిన అనంతరం తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

ఎన్నిక ఏకగ్రీవం..

విజయనగరం: ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎం.ఎస్.ఎన్.రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒంగోలులో జరిగిన 36వ రాష్ట్ర మహాసభలలో ఈ ఎన్నిక జరిగింది. ఈ మేరకు రాజుకు ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు, విజయనగరం జిల్లా ప్రతినిధులు ప్రసాద్, శేషగిరిరావు, వెంకటేశ్వర మహాపాత్రో, సన్యాసిరావు తదితరులు అభినందనలు తెలిపారు.

సర్టిఫికెట్ల అందజేత

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ అప్పారావు రోడ్డులో ఉన్న డిమ్స్ కంప్యూటర్ సెంటర్‌లో కోర్సు పూర్తి చేసిన వారికి గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఎంతోమంది విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తుండడం ఆనందంగా ఉందని నిర్వాహకుడు రాజు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

29న పుస్తకావిష్కరణ

విజయనగరం: జిల్లా పరిషత్ కార్యాలయంలో రచయిత బెహరా వెంకటసుబ్బారావు రచించిన మధ్యతరగతి మందహాసం అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు నేషనల్ ఇన్‌ఫర్మేటిక్స్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ బెహరా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను నగరంలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు జరిగే పుస్తకావిష్కరణ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వస్తారని, ఆయన చేతులమీదుగా పుస్తకం విడుదల చేయడం జరుగుతుందన్నారు. సాహితీవేత్తలు, భాషాభిమానులు, నవలాకారులంతా కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

నెల్లిమర్ల: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి సంఘ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రి ప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ఆగస్టు 15వ తేదీ నాటికి ఆస్పత్రి కొత్త భవన నిర్మాణం అన్ని హంగులతో తయారవుతుందన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రోజూ పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎస్ గీతా భవాని, కమిషనర్ తారక్ నాథ్, ఎంపీడీవో రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ


బీసీ కాలనీలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, రూరల్ పోలీసులు

విజయనగరం క్రైమ్: అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినంలో భాగంగా విజయనగరంలోని వీటీ అగ్రహారం బీసీ కాలనీలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం స్టూడెంట్స్‌తో ర్యాలీ నిర్వహించారు. బీసీ కాలనీలోని మహిళా ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వీటీ అగ్రహారం వరకు కొనసాగింది. విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ర్యాలీ జరగ్గా స్టేషన్ సిబ్బంది ఎస్సై అశోక్, మీనాక్షి, రామారావులు పాల్గొన్నారు. అనంతరం సీఐ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో మత్తు పదార్థాల వినియోగం వద్దంటూ బీసీ కాలనీలో స్టూడెంట్స్‌తో ర్యాలీ నిర్వహించామని తెలిపారు. రూరల్ పరిధిలో ఏడాది కాలంలో 38 కేసులు నమోదు చేసి 1300 కేజీల గంజాయని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 118 కేసుల్లో 2100 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, 388 మందిని అరెస్ట్ చేశామని 23 మందిపై రౌడీషీట్స్ తెరిచామని సీఐ తెలిపారు.గంజాయి నిర్మూలనపై తమ శాఖ చాలా సీరియస్‌గా ఉందని ఎస్పీ ఆదేశాలతో ఏ ఒక్కరినీ విడిచి పెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

94 యూనిట్ల రక్తం సేకరణ


రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ సీతారామరాజు

డెంకాడ: మాన్సాస్ సంస్థ చైర్మన్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోకగజపతిరాజు పుట్టినరోజు పురస్కరించుకుని, చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల, రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో దాతల నుంచి మొత్తం 94 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మాన్సాస్ కరస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్ రాజు, కళాశాల డైరెక్టర్ పీఎస్ సీతారామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.శేఖర్, ఎన్ఎస్ఎస్ పీవో ఎన్.షణ్ముఖరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత డీఈఓపై దాడి

విజయనగరం క్రైమ్: విజయనగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అయ్యప్పనగర్‌లో నివసిస్తున్న విశ్రాంత డీఈఓ అప్పలనాయుడిపై గురువారం గుర్తుతెలియని వ్యక్తి దాడిచేశాడు. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 24న సోలార్ కనెక్షన్ పనికోసం కొందరు పనివారు విశ్రాంత డీఈఓ ఇంటికి వచ్చి వెళ్లిపోయారు. సోలార్ పనిచేసేందుకు అంటూ గురువారం ఓ యువకుడు వచ్చాడు. పని చేస్తున్నట్టు నటించి కత్తితో విశ్రాంత డీఈఓపై దాడిచేశాడు. ఆయన చేతులకు గాయాలయ్యాయి. భార్య హైమావతి కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. గాయపడిన అప్పలనాయుడును చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలి

విజయనగరం: ప్లాస్టిక్ రహిత నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించిన ఆయన..పారిశుధ్య నిర్వహణ పనితీరును పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద ఉన్న రైతుబజార్ ప్రాంతానికి వెళ్లిన ఆయన.. కూరగాయల వ్యాపారులు పాలిథిన్, ప్లాస్టిక్ వాడకం చేస్తున్నారా లేదా అని గమనించారు. ప్రజలు కూడా నిషేధిత పాలిథిన్ సంచులను వినియోగించవద్దన్నారు. ఇదిలా ఉంటే రైతుబజారు వెలుపల ఉన్న వ్యాపారస్తులంతా విచ్చలవిడిగా పాలిథిన్ కవర్లు వినియోగించడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి నుంచి నిషేధిత పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకుని, అపరాద రుసుం విధించారు. అనంతరం 47వ నంబరు సచివాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాయన్నారు. అనేక సార్లు ఈ విషయమై అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్లాస్టిక్ వస్తువులను విక్రయించడం వినియోగించడం చేస్తున్నారన్నారు. ఇకపై ఆకస్మిక దాడులను ముమ్మరం చేస్తామని, ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

విజయనగరం: నగరంలోని 40వ డివిజన్, ఎల్‌బీ కాలనీలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మిలు గురువారం వార్డు సందర్శన చేశారు. ఈ సందర్భంగా వారు ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నిచోట్ల రోడ్లు ఆక్రమించి భవన నిర్మాణ సామగ్రి, వ్యర్థాలు ఉండడాన్ని గమనించి, సంబంధిత వ్యక్తులను మందలించారు. తక్షణమే వాటిని తొలగించాలని సూచించారు. అక్కడి నుంచి ప్రాథమిక పాఠశాల, పరిసరాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

విజయనగరం ఫోర్ట్: నగర పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ ఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో ఉడా కాలనీ ఫేజ్–3, ఫేజ్–4, బొబ్బాదిపేట, మహాలక్ష్మినగర్, గోకపేట, సూర్యనగర్, ఆర్టీసీ కాంప్లెక్స్, పోలయ్యపేట, ఎల్‌బీ కాలనీ, మారుతీనగర్, సెయింట్ మేరీ స్కూల్, పోస్టాఫీస్, గౌతమినగర్, సాలిపేట, వివేకానంద కాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విజయనగరం ఫోర్ట్: మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ ఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా దత్త గార్డెన్, ద్వారపూడి, గుంకలాం, నందాం, రామవరం, కోరుకొండ సైనిక్ స్కూల్, కుమరాం ఇండస్ట్రియల్ ఫీడర్ ప్రాంతాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ అంతరాయం కలుగుతోందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు విడుదల చేస్తున్న పాస్టర్ రవికుమార్ తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక అంబటి సత్రం వద్ద ఉన్న ఏసు ప్రేమాలయంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న థామస్ మార్చ్‌ను విజయవంతం చేయాలని పాస్టర్ అలజంగి రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆ కార్యక్రమ కరపత్రాలను చర్చిలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీస్తు శిష్యుడైన థామస్ జెరూసలేం నుంచి కేరళలో ప్రచారానికి వచ్చి, పరమపదించిన రోజును పురస్కరించుకుని ఈ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. అంబటి సత్రం వద్ద మార్చ్ ప్రారంభమై మూడు లాంతర్లు, గంటస్తంభం, బాలాజీ, కోట జంక్షన్‌ల మీదుగా తిరిగి చర్చి వద్దకు చేరుతుందన్నారు. 30న వర్షిప్ డే సందర్భంగా వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో పేదలకు అన్నదానం చేయనున్నామన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు

డెంకాడ: మండలంలోని అక్కివరం గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేసే కార్యక్రమం గురువారం చేపట్టారు. తొలిరోజు 957 మూగజీవాలకు నట్టల నివారణ మందు వేయగా, ఉచితంగా అందిస్తున్న ఈ సదుపాయాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు కంది చంద్రశేఖర్‌రావు కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందును గురువారం వేశారు. సతివాడ పశు వైద్యాధికారి ప్రవీణ్ మాట్లాడుతూ పశువుల ఎదుగుదలకు ఈ మందు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. సన్నజీవాలు ఉన్న రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్ అందజేసి, ఉచితంగా మందులు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం ఫోర్ట్: మండల పరిధిలోని గాజులరేగ గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు గురువారం వేశారు. ఈ కార్యక్రమానికి పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వైవీ రమణ హాజరై, పాడిరైతులను ఉద్దేశించి కాసేపు మాట్లాడారు. మూగజీవాలకు వ్యాధులు రాకుండా వేయాల్సిన ముందస్తు టీకాలు వేయించాలని, ఎప్పుడైనా ఏ మూగజీవి అనారోగ్యం బారిన పడినా వెంటనే పశువైద్య కేంద్రానికి తీసుకువెళ్లి, చికిత్స అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గొర్రెలు, మేకల పెంపకం దారులసంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ, వెటర్నరీ పాలిక్లినిక్ ఉప సంచాలకులు మహాలక్ష్మి, సహాయ సంచాలకులు ధర్మారావు, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన


మాట్లాడుతున్న సైకాలజిస్ట్ పద్మాక్షి లోకేష్

విజయనగరం అర్బన్: స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్(జీవిత మార్గదర్శకత్వం)పై బెంగళూరుకు చెందిన ప్రముఖ క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ పద్మాక్షి లోకేష్ గురువారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలోని యువత ఎక్కువగా మానసిక ఒత్తిడి అనే సమస్యను ఎదుర్కొంటున్నారని, ఏదైనా విషయంలో ముందుచూపు కలిగి సరైన నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ఆదర్శవంతమైన జీవనం సాగిస్తూ ఉత్తమ పౌరులుగా వెలుగొందాలన్నారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉంటే ఒత్తిడి నుంచి దూరంగా ఉన్నట్టేనన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చదరంగ పోటీల నిర్వహణ సాహసమే..

విజయనగరం గంటస్తంభం: జిల్లా కేంద్రంలోని మెసానిక్ టెంపుల్‌లో జిల్లా చదరంగం అసోసియేషన్, ఫైర్ చెస్ స్కూల్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల ఐదో జాతీయ చదరంగం పోటీలు నిర్వహించడం సాహసమేనని, నిర్వాహకుల కృషి అభినందనీయమని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ అన్నారు. రెండు రోజుల పోటీల్లో భాగంగా రెండో రౌండును గురువారం ప్రారంభించి, క్రీడాకారులకు ఆల్‌ది బెస్ట్ చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా చదరంగంలో ఉత్సాహవంతులైన యువతీ, యువకులు 15 రాష్ట్రాల నుంచి 150 మందికి పైగా హాజరయ్యారంటే చదరంగం పట్ల వారికున్న మక్కువను అర్థం చేసుకోవచ్చునన్నారు. ఇక్కడ పోటీల్లోని విజేతలు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా అవకాశాలు కల్పిస్తుండడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకుడు కేవీ జ్వాలాముఖి, పౌర వేదిక ప్రతినిధులు గోపాలరావు, ఈశ్వర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న మండల పరిషత్ అధ్యక్షుడు అప్పలనాయుడు

విజయనగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలన్నీ అర్హులందరికీ అందాలని మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు ఆదేశించారు. ఇదే విషయమై ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించి, మాట్లాడారు. మండలంలోని 1199 మందికి తల్లికి వందనం పథకం ద్వారా రావాల్సిన మొత్తం అందలేదన్నారు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం విద్యుత్ వినియోగం సగటున 300 యూనిట్లు అధికంగా వినియోగించకూడదని, నాలుగు చక్రాలు వాహనాలు కలిగి ఉండకూడదని, 10 ఎకరాల భూమి ఉన్న వారిని అనర్హులుగా ప్రకటించినప్పటికీ అర్హుల్లో కూడా కొంతమందికి అందలేదన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎ.మోహన్‌కుమార్, వ్యవసాయాధికారి ఎ.శ్రీనివాసరావు, ఎంఈవో పీవీబీ రాజు, ఈవోపీఆర్డీ సీహెచ్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



తాగునీటి సమస్య పరిష్కరించాలని పూసపాటిరేగ మండలం, ఏతపేట కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. గ్రామం ఎత్తైన ప్రాంతంలో ఉండడంతో కుళాయిల ద్వారా సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని, దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. చంపావతి ట్యాంకు నుంచి ఏతపేటకు ప్రత్యేక పైపులైన్ వేసి తాగునీరు అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈవోపీఆర్డీ జ్ఞానేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.సన్యాసినాయుడు, లక్ష్మణరావు, అప్పారావు, రామారావు, మహిళలు పాల్గొన్నారు.

–పూసపాటిరేగ

అక్రమ నిర్మాణం కూల్చివేత



విజయనగరం ఒకటో నంబరు డివిజన్, వేణుగోపాలపురం బిట్–2లో అనుమతులు లేకుండా చేసిన నిర్మాణాన్ని నగరపాలక సంస్థ అధికారులు గురువారం కూల్చేశారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు అక్కడికి జేసీబీతో చేరుకున్న సిబ్బంది కట్టడాన్ని తొలగించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసి, డబ్బులు వృథా చేసుకోవద్దని, కార్పొరేషన్ అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణాలు చేసుకోవాలని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో టీపీఎస్ అనిత, ప్రణాళికా కార్యదర్శులు, చైన్ మ్యాన్‌లు పాల్గొన్నారు.

–విజయనగరం

'దారి'ద్ర్యం



విజయనగరం జిల్లా రూరల్ పరిధిలోని గుంకలాం జగనన్న కాలనీ వద్ద రోడ్డు అధ్వానంగా తయారైంది. రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు ఆ దారిలో వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు ఎత్తుపల్లాలకు వాహనంపై వెళ్తుంటే గతుకులకు ఒళ్లు హూనమైపోతోందన్నారు. అద్దాల్లా మెరిసే రోడ్లు కాదు..బాగులేని రోడ్ల మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పరోక్షంగా విమర్శిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం